# 8

# చెంచులచ్చి

"సోదె చెపుతా తల్లీ
మాట చెపుతా తల్లీ
మర్మ మిరుస్తా చెల్లీ"

అని సోదెమనిషి పాడుతోంది.

గోదావరిలో ఈతలేస్తున్న పిల్లలను చూస్తున్న శకుంతలకు సోదె మనిషి పాట వినిపించలేదు. వినిపించదు. శకుంతల గతమంతా తిరగవేస్తున్నది.

"సోదె చెపుతా తల్లీ
మాట చెపుతా తల్లీ
మనసులో బొమ్మా
మాయలాడీ బొమ్మా
మర్మమిరుస్తా చెల్లీ,
మాట చెపుతా తల్లీ"

శకుంతలకు కొంచెం దూరంగా నుంచుని బుర్ర మీటుతూ సోదె మనిషి పాడుతోంది.

శకుంతల నిజంగా పిల్లలనే చూస్తున్నదా ? స్నానం చేసి ఆదరా బాదరా ఇళ్ళకు వెళ్తున్న వాళ్ళను చూస్తున్నదా ?

"సోదె చెపుతా తల్లీ
మాట చెపుతా తల్లీ
మర్మ మిరుస్తా తల్లీ"

శకుంతల చెవుల్లో జోరీగలు జొరబడినట్లయి అటు కూర్చున్నదల్లా ఇటు తిరిగింది. ఎవరు ? సోదెమనిషి ! తనకు సోదె చెపుతుందట. శకుంతల ఉలిక్కిపడి కొంచెం అవతలికి జరిగింది.

సోదె మనిషి చిరునవ్వుతో—

"సోదె చెపుతా తల్లీ
మబ్బు లిరుస్తా చెల్లీ"

అన్నది.

"ఫో...ఫో...సోదె వద్దు...గద్దే వదు."

"పొమ్మంటే పోను
రమ్మంటే రాను
వద్దంటే వాదు
కాదంటే పాదు
పొమ్మంటే పోను"

"ఏమి టీ వెధవ గొడవ ?"

"తప్పూ...తప్పూ. వెధవ గొడవకాదు. పసుపూ కుంకుమ గొడవ. మెళ్ళో తాడుకట్టినవాడి గొడవ. దాస్తే దాగదు. చెంచులచ్చిమాట తప్పదు."

"అబ్బబ్బా...ఇదెక్కడి గోలరా బాబూ...పోలీసులను పిలుస్తానుండు."

"పోలీసులా ? ఎందుకూ ?"

"మరి పొమ్మంటే పోవేం ?"

"పోతా మరి, నామాట విను. అట్లా దిగాలుపడి కూచుంటే ఎట్లా మరి ??"

శకుంతల లేచి నుంచున్నది :

"చెప్పూ...తొందరగా...చెప్పూ, నీ మాటేమిటే ?"

అప్పటికే వాళ్ళ చుటూ జనం గుమికూడారు సోద్యం చూడడానికి.

"ఇక్కడ కాదు. చెప్తా పద. ముందుకు నడు. వెళ్దాం రా."

"అమ్మో ! నా వెంట వస్తావా ?"

"నీ వెంట రాన్లే. భయపడకు. అదుగో ఆ రావి చెట్టుదాకా వస్తా. ఆలోగా అంతా చెప్తా. నీ దిగులు పోతుంది. పెద్ద చదువులు చదివావ్. ఇంకా పెద్ద చదువులు చదివిన మారాజు తాడుకట్టాడు. పదా..."

* *

*

"చెప్పండీ. అసలుసంగతి చెప్పండీ."

"................."

"నా మీద నమ్మకం లేదా ? నేను బ్రతకడం మీకు ఇష్టం లేదా ? చెప్పండీ...మీ మొదటిభార్య ఏమయిందీ ? చెప్పండీ...ఇంకా ఎందుకు దాస్తారూ..."

"ఇప్పు డదంతా ఎందుకు చెప్పు శకుంతలా ? డాక్టరు వచ్చి మందుఇస్తాడు. నీ భయం తగ్గిపోతుంది. అనవసరంగా గొడవ చెయ్యకు."

"ఎందుకా ? ఎందు కేమిటండీ ? ఇదేనా మీ విజ్ఞానం ? ఇదేనా మీ పాండిత్యం ? ఇందు కేనా మీరు చదువు కున్నది ? మీ మొదటి భార్యపోయింది కాశీలో కాదూ ?"

"ఆ......అవును. హిందూ విశ్వ విద్యాలయంలో పనిచేస్తున్నాను అప్పుడు. బాబిగాణ్ణి కని ఇరవయ్యో రోజున చచ్చిపోయింది."

"చచ్చిపోయిందా? అబద్ధం. పచ్చిఅబద్ధం. చచ్చిపోయిం దనుకొని పచ్చి బాలింత రాలిని గంగలోకి తోసేశారు."

"శకుంతలా!" బిగ్గరగా అరిచాడు శర్మ.

"అట్లా అరిస్తే నేను భయపడను. నిజం దాగదు. చచ్చిందనుకుని మీరు గంగలో వదలిన మీ మొదటి భార్య గోదావరి ఒడ్డున ఉన్నది. పోయి తెచ్చుకోండి."

"శకుంతలా, నీ కేమన్నా పిచ్చెక్కిందా?"

"అవును...పిచ్చే......కాకపోతే బాలింత రాలిని గంగలో తోసెయ్యడ మేమిటి? ఆ బాలింతరాలు కొండ చెంచులకు దొరకడం–వాళ్ల చేతులలో ఆమె నానాయాతనలు పడి సోదెబుట్టతో మిమ్మల్ని వెదుక్కుంటూ రావడం –

ఏమి టిదంతా...పిచ్చి...చదువు తెచ్చిన పిచ్చి.''

''ఇంతకూ నువ్వనేదేమిటి?''

''ఇదుగో, ఈ తాయత్తు చూడండి. మీరు మీ మొదటి భార్యకు కట్టించిందేనా? ఇదుగో ఈ ఉంగరం చూడండి. దీనిమీద మీ పేరున్నదా? మీ కాళ్లు పట్టుకుంటా. వెళ్ళి ఆమెను తీసుకురండి. మీ పెద్దబ్బాయి ఆమెను గుర్తుపట్టి ఎంత అడిగినా రావడంలేదు.''

''వీల్లేదు శకుంతలా. అదేమీ జరిగేది కాదు. మళ్ళీ ఆ మనిషిని ఈ ఇంట్లోకి తీసుకురాలేను. ఇంక ఏం చెయ్యమన్నా చేస్తా కాని ఈ విషయం ఇంతటితో వదిలెయ్యి.''

''ఎందుకని తీసుకురాలేరూ?? ప్రాణం పోయిందనుకుని గంగలో తోసేశారు. ఆమె కొండ చెంచులకు దొరికింది. వాళ్ళదగ్గర మంత్రాలు నేర్చుకుని, వాళ్ళనుంచి తప్పించుకుని సోదెబుట్టతో మిమ్మల్నీ, పిల్లలనూ వెదుక్కుంటూ వచ్చింది. బిడ్డలకోసం, పాపం, ఆమె ఎంత క్షోభిస్తున్నదో? తల్లిబిడ్డలకు ఎడబాటు తెచ్చిన పాపం నాకు కట్టకండి...ఆమెను తీసుకురాకపోతే నేను బతకను. చాలా మంచిది ఆమె. చాలా మంత్రాలు తెలుసు ఆమెకు. నన్ను గుర్తుపట్టింది. మన సంగతంతా చెప్పింది.''

''ఏం లాభంలేదు శకుంతలా. బాబిగాణ్ణి కని ఇరవయ్యోరోజున ఆమె చచ్చిపోయింది. పోనీ, మేమందరం అట్లా అనుకున్నాం...ఇంట్లో మరో ఆడదిక్కు లేకుండా పనిమనిషి సహాయంతో నేనే పురుడు పోశాను...మధ్యా

హ్నాం రెండు గంటలప్పుడు అనుకుంటాను, డాక్టరు వచ్చి ఆమె ప్రాణం పోయిందన్నాడు. వెంటనే అందరికీ టెలి గ్రాములు ఇచ్చాను...పెద్ద వాన...ఆ వానలోనే నలుగురు కూలీలను పోగుచేసి శవాన్ని వాటికకు తీసుకుపోయేటప్పటికి రాత్రి ఎనిమిదైంది...

"ఆ తర్వాత ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి కొంత కాలం దేశంతిరిగాను. తర్వాత ఇక్కడ ఉద్యోగానికి కుది రాను. దాని పిల్లల కేమీ ఫరవాలేదు. నా ఆస్తి అంతా వాళ్ళకే ఇచ్చాను."

"జరిగిందేమో జరిగింది. ఇప్పుడు అదంతా ఎందుకూ? బ్రతికి మిమ్మల్ని వెదుక్కొంటూ వచ్చిందిగా. మీరు ఎం దుకు తీసుకురారాదూ?"

"అదేమీ వీలుకాదు...ఎక్కడైనా ఇట్లా జరుగు తుందా?...చచ్చిపోయిందని నిశ్చయించాం. కర్మకాండ అంతా జరిగిపోయింది...ఆమె బ్రతికినట్టు తెలిసింది నా కొక్కర్తెకే కాదు. ఇంకా కొంతమందికి తెలుసు...కాని, ఆమెను తీసుకురాను. తీసుకురాలేను."

"ఇదే మీ చివరి నిర్ణయమా? నామాట వినరా?"

"ఇది నా నిర్ణయం కాదు. లోకంపోకడ. సంప్ర దాయం!"

"లోకం పోకడ! సంప్రదాయం! భలే చెప్పారు సైన్సుమాస్టరూ??? భలే చెప్పారు...ఇదేనా విదేశాల్లో మీరు సంపాదించిన డిగ్రీలు నేర్పిన చదువు? ఆడదానిపై

ఇదేనా మీఅభిప్రాయం?''

"అవన్నీ నాకు తెలియవు. అడిగావు కనుక నేను చేయగలిగినది చెప్పాను.''

"అంతే కాని ఆమెను తీసుకురానంటారు. అంతేనా...''

"అంతే...''

*

* *

శకుంతల మంచానపడి ఆరు నెలలయింది. జబ్బేమిటో తెలియదు. దగ్గుతుంది. ఏడుస్తుంది. జ్వరం...అట్లా మంచంలో పడి ఉంటుంది. డాక్టర్లు మందు లిచ్చినా ప్రయోజనం కనిపించడం లేదు. స్పృహలేకుండా రోజూ గంటల తరబడి పడి ఉంటుంది. ఆమె తండ్రి రామారావు మెల్లిగా ఆమెదగ్గరే సంగతంతా తెలుసుకున్నాడు.

ఆ సోదె మనిషికోసం రామారావు రాజమండ్రి వెళ్ళాడు. ఇంకా చాలా వూళ్ళు తిరిగి ఆఖరికి బందరులో ఆమెను పట్టుకున్నాడు.

అదేం మర్మమోగాని రామారావు చెప్పేది వింటుంది సోదెమనిషి. అదేదో భాషలో బదులు చెపుతుంది. అది రామారావుకు అర్థంకాదు. బ్రతిమాలి బామాలి శర్మ లేకుండా చూచి సోదెమనిషిని రామారావు తీసుకువచ్చాడు.

సోదెమనిషి సరాసరి శకుంతల మంచం దగ్గరికి వెళ్ళింది. మంచంచుట్టూ ప్రదక్షిణం చేసి ఎవరికీ అర్థం

కాని భాషలో ఏమిటేమిటో అన్నది. శకుంతల కప్పుకున్న దుప్పటి తీసి చేత్తో వళు నిమురుతూ సోదెమనిషి ఏదో పాడింది......

వళ్ళు తెలియకుండా పడి ఉన్న శకుంతల లేచి కూర్చుంది.

సోదెమనిషిని కావలించుకుని ఏడ్చింది. "అక్కయ్యా" అన్నది.

కాని, సోదెమనిషికి ఆ మాటలు అర్థంకాలేదు. అర్థంకానటు సోదెమనిషి శకుంతలకేసి చూస్తుండగా శర్మ వచ్చాడు.

"పార్వతీ" అన్నాడు శర్మ.

"తప్పు ...తప్పు... చెంచులచ్చి. గురువాజ్ఞ..." అంటూ సోదెమనిషి లేచి నుంచున్నది.

"పార్వతీ" అన్నాడు శర్మ.

"తప్పు...తప్పు...గురువాజ్ఞ" అంటూ సోదెమనిషి వెళ్ళిపోయింది.